సాక్షి
మహబూబాబాద్
ఆదివారం | 24 | సెప్టెంబర్ | 2023



మళ్లీ మొదటికి.. - 8లో▸

గ్రూప్‌-1 ఉద్యోగాల భర్తీ మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్‌ రద్దు చేస్తున్నాం. మళ్లీ రాయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో అభ్యర్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.



పేదల వ్యతిరేక ప్రభుత్వాలను...

పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్‌ ఐఏఎస్‌ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/25^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్‌

రక్తదానం ప్రాణదానంతో సమానం



మహబూబాబాద్‌ అర్బన్‌: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్‌ ప్రొఫెసర్‌ వైద్యుడు బి.హరీశ్‌ కుమార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ హరీశ్‌ కుమార్‌ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మను ప్రసాదించవచ్చన్నారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్‌ కౌన్సిలర్‌ డోలి లింగ బాబు, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ వై.కృష్ణ ప్రసాద్‌, ప్రిన్సిపాల్‌ గట్ల శ్రీపాల్‌ రెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ శంకర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రసాద్‌, సిహెచ్‌. ప్రసాద్‌, అధ్యాపకులు, బ్లడ్‌ బ్యాంక్‌ సిబ్బంది వెంకన్న, అక్బర్‌, కిరణ్‌, అరుణ, నాసర్‌ పాల్గొన్నారు.

రేపటి గ్రీవెన్స్‌ రద్దు

మహబూబాబాద్‌: ప్రజావాణి కార్యక్రమం అనివార్య కారణాలతో తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్‌ కె.శశాంక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న (సోమవారం) ప్రజలు తమ వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



నెహ్రూసెంటర్‌: రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌ డిమాండ్‌ చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి పశుపతి కుమార్‌ పాశ్వాన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్‌ మాట్లాడారు. అంగన్‌వాడీలకు కేంద్ర వాటాను పెంచి ఇవ్వాలని, రెగ్యులర్‌ ఉద్యోగులుగా గుర్తించాలని, బీమా సౌకర్యం కల్పించి అంగన్‌వాడీలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బైరీ రమేష్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడీ అంజయ్య, అసాది పురుషోత్తం, శ్రీరాములు, వెంకటస్వామి, సుధీర్‌, శరత్‌, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌ మేళా

మహబూబాబాద్‌ అర్బన్‌: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఈజీఎంఎం ఎంప్లాయ్‌మెంట్‌ జనరేషన్‌ మార్కెటింగ్‌ మిషన్‌ ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణ కేంద్రంలోని రామ ఉపేందర్‌ గార్డెన్‌లో ఈ నెల 25న జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ఆర్‌ సన్యాసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువతీయువకులు సోమవారం ఉదయం 10 గంటలకు అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌, రెండు పాస్‌ఫొటోలు, ఆధార్‌ కార్డుతో హాజరు కావాలన్నారు. అభ్యర్థుల కనీస వయసు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్యసిబ్బంది స్థానికంగా ఉండాలి



గార్ల: సీజనల్‌ వ్యాధులను అరికట్టేందుకు వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉంటూ గ్రామాల్లో వైద్యసేవలు అందించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్‌ సుధీర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ముల్కనూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో డెంగీ కేసులు ఎక్కువ నమోదైనందున వైద్యులు, సిబ్బంది సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు మానుకొని గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. విషజ్వరాలు అరికట్టేందుకు వైద్యులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతోనే దోమల ఉధృతితో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని, సంబంధిత అధికారులు సైడ్‌ కాల్వల్లో నీటి నిల్వ లేకుండా పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్‌ రవూఫ్‌, కృష్ణార్జున్‌, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

దోమలు బాబోయ్‌..

పెరుగుతున్న దోమల తీవ్రత

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- మురుగునీరు, చెత్తతో నిండిన డ్రెయినేజీలు
- కన్నెత్తిచూడని పారిశుద్ధ్య కార్మికులు
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

సాక్షి గ్రౌండ్‌ రిపోర్ట్‌

మహబూబాబాద్‌: మానుకోట మున్సిపాలిటీలో డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో దోమల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మురుగు కాల్వల్లో ఖాళీ వాటర్‌ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, ఇతర వాటితో నిండిపోయాయి. దీంతో దోమలతో పాటు పందుల సంఖ్య విపరీతంగా పెరిగి అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. శనివారం జిల్లాలోని మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్యపై 'సాక్షి' గ్రౌండ్‌ రిపోర్టులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.



- 36వ వార్డులోని కట్టెల మండె వద్ద అసంపూర్తి కాల్వ.. ఆపై కాల్వలో మురుగునీరు శుభ్రం చేయకపోవడంతో నీరంతా రోడ్డుపై చేరింది. ఫలితంగా దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి.

మానుకోట మున్సిపాలిటీలో..

మానుకోట మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా సుమారు 25,000లకు పైగా గృహాలు ఉన్నాయి. 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. 141 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండగా పారిశుద్ధ్యం విషయంలో కార్మికులతో పాటు కారోబార్లు, వాటర్‌ సప్లయీస్‌ చేసే వారితో కలిపి 203 మంది పని చేస్తున్నారు. పది ట్రాక్టర్లు, 25 ట్రాలీ ఆటోలతో చెత్త సేకరణ చేస్తున్నారు. ప్రతి రోజు 27 టన్నుల పొడి చెత్త, 6 టన్నుల తడి చెత్త సేకరణ చేస్తున్నారు. అంతా బాగానే ఉన్నా.. కాల్వలను శుభ్రం చేసే విషయాన్ని విస్మరిస్తున్నారు. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

- 11వ వార్డులోని భవానీనగర్‌ తండాలో డ్రెయినేజీ లేక రోడ్డుపై మురుగు నీరు చేరింది. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాల, ప్రభుత్వ పాఠశాల ఎదుట ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న డ్రెయినేజీ అంతా చెత్తాచెదారంతో నిండింది. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.
- 19వ వార్డులోని హరికిషన్‌ మిల్లు వెనుక ఉన్న కాల్వ నిండి కొన్ని రోజులు అయినా అలాగే ఉంది. శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు దారుణంగా మారాయి.
- ఎంపీ క్యాంపు కార్యాలయం వెళ్లే రోడ్డులో ఖాళీ స్థలంలో చెత్తాచెదారంతో మురుగు నీరుతో నిండి పోయింది.
- స్నేహనగర్‌లో పూర్తి స్థాయిలో కాల్వలు లేక పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దోమల సంఖ్య పెరిగి రాత్రి ఇబ్బందులు పడుతున్నామని, పిల్లలకు జ్వరాలు రావడంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నామని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భవానీనగర్‌ తండాలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు



ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాల ఎదుట చెత్తతో నిండిన డ్రెయినేజీ

నిద్ర పట్టడం లేదు..



ఏక్యాబిన్‌ సమీపంలో డ్రెయినేజీకి నెలకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వ మురుగు నీరు ఇతర వాటితో నిండి దుర్వాసన వస్తుంది. దోమల సంఖ్య కూడా పెరిగి రాత్రి పూట నిద్ర సరిగా ఉండటం లేదు. వారానికి ఒక్కరోజు అయినా కాల్వలు శుభ్రం చేయాలి.

– కె.చందు, స్థానికుడు

దోర్నకల్‌ మున్సిపాలిటీలో..



దోర్నకల్‌: మెయిన్‌ రోడ్డు సమీపంలో నిలిచిన నీరు

దోర్నకల్‌: దోర్నకల్‌ మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో మురుగు నీరు నిల్వతో దోమల బెడద ఎక్కువగా ఉంది. 8, 9వ వార్డుల్లోని బ్యాంక్‌ స్ట్రీట్‌లో సైడ్‌ కాల్వలను శుభ్రం చేయడం లేదు. పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు నిలిచింది. దీంతో స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. వీధుల్లో మూడు రోజులకొకసారి చెత్తను తొలగిస్తున్నారు. అలాగే 13వ వార్డు పరిధి సాయినగర్‌ నాలుగో వీధిలో మురుగు నీరు నిలుస్తుండటంతో ఆ ప్రాంతమంత కలుషిత వాతావరణం నెలకొంది.

మరిపెడ మున్సిపాలిటీలో..



మరిపెడ: డ్రెయినేజీలో నిలిచిన మురుగునీరు

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని పలు వీధుల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ఎక్కడి కాల్వలో అక్కడ బురదమయంగా మారి వాటిపై దోమలు, ఈగలు వాలి అనారోగ్యాలకు గురిచేయడమే కాకుండా వీధులవెంట దుర్గంధం వెదజల్లుతున్నాయి. పరిసరాల పరిశుభ్రంలో మున్సిపాలిటీ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం..



తొర్రూరు: ఆటోలో చెత్త వేస్తున్న స్థానికురాలు

తొర్రూరు: పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దుబ్బతండా, సాయినగర్‌, అంబేడ్కర్‌ నగర్‌, జంగాల బజార్‌లో మురుగు నిల్వ ఉండటంతోపాటు ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా పట్టణంలో రోజు రోజుకూ జ్వర పీడితులు పెరుగుతున్నారు. అయితే పారిశుధ్య సిబ్బంది కొరత ఉండటం కొంత సమస్యగా మారింది. ఉన్న 2 ట్రాక్టర్లు, 4 చెత్త సేకరణ ఆటోలతో చెత్తను తరలిస్తున్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు చేపట్టాలి

- కలెక్టర్‌ కె.శశాంక

మహబూబాబాద్‌: ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్‌ కె.శశాంక ఆదేశించారు. శనివారం కలెక్టర్‌ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్పీ చంద్రమోహన్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ పోలింగ్‌ కేంద్రాల్లో ర్యాంపుల నిర్మాణాలు చేపట్టేందుకు అంచనా వేసి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. 18 సంవత్సరాల ఓటర్లు ఎక్కువగా ఉన్న యువత పోలింగ్‌ స్టేషన్లను గుర్తించాలన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి కావాల్సిన వాహనాలను సమకూర్చాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 25న కాళోజీ అవార్డు గ్రహీత జయరాజ్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్‌ ఆదేశించారు. ఈ సన్మాన కార్యక్రమానికి మంత్రులు హాజరుకానున్నారని, సాహితీప్రియులు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌ కె.శశాంక

ఓటరు జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలి

ఓటరు జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్‌ శశాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయాన్ని శనివారం కలెక్టర్‌ సందర్శించి ఓటరు జాబితా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఫారం 6, 7, 8, ప్రగతిని వేగవంతం చేసి నివేదిక అందజేయాలన్నారు. ఆర్డీఓ అలివేలు, తహసీల్దార్‌ ఇమానియల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాయం జరిగితే ఊరుకోవద్దు

మహిళలకు అండగా అభయ యాప్‌ రూపకల్పన

- జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఆటోలకు క్యూఆర్‌ కోడ్‌
- యాప్‌ ఆవిష్కరణ సభలో ఎస్పీ చంద్రమోహన్‌

బయ్యారం: జిల్లాలో ఎవరికి అన్యాయం జరిగినా ఊరుకోవద్దని న్యాయం చేసేందుకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని ఎస్పీ జి.చంద్రమోహన్‌ అన్నారు. ఆటోలు, క్యాబ్‌ల్లో ప్రయాణించే వారి భద్రతపై భరోసా కల్పించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తయారుచేసిన అభయ యాప్‌ను శనివారం బయ్యారంలో ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ యాప్‌ మొదటగా సిరిసిల్లలో ప్రారంభం కాగా రెండోసారి బయ్యారంలో ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు సురక్షితంగా పూర్తి రక్షణతో ప్రయాణించేందుకు యాప్‌ను ఆవిష్కరించటం జరిగిందని, ఆపద సమయంలో అభయ యాప్‌ను సద్వినియోగం చేసుకొని జరగబోయే ప్రమాదాలను నివారించుకోవచ్చన్నారు. ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్న ఆటోలో ఉన్న క్యూర్‌ కోడ్‌ను మొబైల్‌ఫోన్‌లో స్కాన్‌ చేస్తే ప్రయాణిస్తున్న వాహనం యొక్క లైవ్‌ లోకేషన్‌ కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌కు చేరుకోవటంతో పోలీస్‌ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం ఆటోకు ఎస్పీ స్వయంగా క్యూర్‌ కోడ్‌ యాప్‌ను అతికించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ సత్యనారాయణ, గార్ల–బయ్యారం సీఐ బాబురావు, బయ్యారం, గార్ల ఎస్సైలు ఉపేందర్‌, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఆటోకు క్యూఆర్‌ కోడ్‌ను అతికిస్తున్న ఎస్పీ

సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పించాలి

నెహ్రూసెంటర్‌: వర్షాకాలంలో మలేరియా, చికున్‌గున్యా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ ఏ.అంబరీష అన్నారు. జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో జిల్లాలోని వైద్యాధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అంబరీష మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు ఉన్నట్లయితే వెంటనే పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం తీసుకునేలా చూడాలని వైద్యాధికారులకు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్స్‌ డాక్టర్‌ శ్రవణ్‌, డాక్టర్‌ విజయ్‌కుమార్‌, డీపీఎం రుక్ముద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అంబరీష

చట్టాలపై అవగాహన ఉండాలి

మహబూబాబాద్‌ అర్బన్‌: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్‌ సివిల్‌ జడ్జి సురేష్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ జూనియర్‌ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సుకు సీనియర్‌ సివిల్‌ జడ్జి సురేష్‌ హాజరై మాట్లాడారు. ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ సీఐ వై. సతీష్‌, ఎస్సై దీపికా రెడ్డి, కోర్టు పీసీ సంపత్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ నరేష్‌ పాల్గొన్నారు. అలాగే వికాస్‌ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు అడిషనల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి తిరుపతి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ దాసరి నాగేశ్వరరావు, న్యాయవాది మోహన్‌, టౌన్‌ ఎస్సై తాహెర్‌ బాబా, ప్రిన్సిపాల్‌ బిక్కి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిపెడలో..

మరిపెడ రూరల్‌/మరిపెడ: రైతులు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తొర్రూర్‌ సివిల్‌ జడ్జి మట్ట సరిత అన్నారు. మరిపెడ మండలం గిరిపురం రైతు వేదికలో మండల న్యాయ సేవా సంస్థ తొర్రూర్‌ ఆధ్వర్యంలో వ్యవసాయం ఉచిత న్యాయ సేవలు అనే అంశంపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల న్యాయసేవ సంస్థ చైర్మన్‌, తొర్రూర్‌ సివిల్‌ కోర్టు జడ్జి మట్ట సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు ఉచిత న్యాయ సేవలను గురించి సుదీర్ఘంగా వివరించారు. అనంతరం మరిపెడ మండలం కేంద్రంలోని తెలంగాణ సోషల్‌ వెల్ఫేర్‌ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గిరిపురం సర్పంచ్‌ పెద్దబోయిన జనార్దన్‌, జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్‌, ఏడీఏ శోభన్‌బాబు, తొర్రూర్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బానోతు లాలు, ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌, న్యాయవాదులు సైదులు, ప్రిన్సిపాల్‌ ఎం.సునిత, వీరసింగ్‌, పవన్‌, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌ అర్బన్‌: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి తిరుపతి

మంత్రి సత్యవతిని కలిసిన వీసీ



మహబూబాబాద్‌: రాష్ట్ర గిరిజన స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కొండా లక్ష్మణ్‌ తెలంగాణ స్టేట్‌ హార్టికల్చర్‌ యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ నీరజ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని మల్యాల గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రానికి అనుబంధంగా హార్టికల్చర్‌ డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఉద్యాన డిగ్రీ కళాశాల ఏర్పాటుతో వ్యవసాయ, అనుబంధ రంగ సంస్థలు అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌ మాలతి

మరిపెడ రూరల్‌: వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోర్డినేటర్‌, శాస్త్రవేత్త మాలతి అన్నారు. మరిపెడ మండలం గిరిపురం గ్రామ రైతు వేదికలో వరిలో సమగ్ర ఎరువుల యాజమాన్యపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాలతి హాజరై మాట్లాడుతూ పంటలకు ఏ విధమైన నష్టం వాటిల్లకుండా తక్కువ ఖర్చుతో సస్యరక్షణ మందులు వాడి అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. మిర్చి పంటకు వచ్చే వైరస్‌కు ఎలాంటి పురుగు మందులు లేవని, రైతులు ముందుగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్‌, ఏడీఏ శోభన్‌బాబు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కాంత్రి, మండల వ్యవసాయ అధికారి వీరసింగ్‌, గిరిపురం సర్పంచ్‌ పెద్దబోయిన జనార్దన్‌, ఏఈఓలు శ్రీకాంత్‌, జావిద్‌, సైదమ్మ, శ్వేత, అన్వేష్‌, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాలతి

విద్యాభివృద్ధికి సహకరించాలి

- డీఈఓ పి.రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

మహబూబాబాద్‌ అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించగా జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ విజయాన్ని రూపొందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తల్లిదండ్రులకు పలు క్రీడలను నిర్వహించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ ఆజాద్‌, హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు

నెహ్రూసెంటర్‌: మహబూబాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు శనివారం తొలగించారు. గుడిసెలను తొలగించేందుకు వచ్చిన రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులను గుడిసెవాసులు, సీపీఐ నాయకులు అడ్డుకుని నిరసన తెలిపారు. జేసీబీకి అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు పెరుగు కుమార్‌ మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా.. హామీలు అమలు కావడం లేదన్నారు. డబుల్‌ బెడ్రూంలు,గృహలక్ష్మి జాడేలేదన్నారు. గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చే వరకు పేదల పక్షాన సీపీఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. పోలీసులు సీపీఐ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించాచారు. అనంతరం సీపీఐ నాయకులను తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేశారు.



సీపీఐ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆయిల్‌పామ్‌ సాగు లాభదాయకం

దోర్నకల్‌: రైతులు ఆయిల్‌పామ్‌ సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని చిలుకోడు గ్రామ రైతువేదికలో ఆయిల్‌ పామ్‌ సాగుపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఆయిల్‌ పామ్‌ పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తే ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం గ్రామ పరిధిలో సాగవుతున్న మిరప తోటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉద్యానశాఖ మండల అధికారి అనితశ్రీ, వ్యవసాయ అధికారి మురళీమోహన్‌, కేవీకే సైంటిస్ట్‌ రాంబాబు, ఏఈఓ అవినాష్‌ తదితరులు పాల్గొన్నారు.

గిర్నిబావిలో పోలీసుల తనిఖీ..

● రూ. 18.90 లక్షల నగదు పట్టివేత


నగదును పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్‌

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో శనివారం వరంగల్‌–నర్సంపేట ప్రధాన రహదారిపై సీఐ పూల్యాల కిషన్‌ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు, లారీలు, జీపులను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వరంగల్‌ నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న టీఎస్‌ 04ఈజె6918 నంబర్‌ గల కారును ఆపి తనిఖీ చేయగా రూ. 15.60 లక్షల నగదు లభించింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కన్నెటి ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌రావును వివరణ కోరగా తాము మిర్చి వ్యాపారులమని, వరంగల్‌ నుంచి ఖమ్మం వెళ్తున్నామని చెప్పారు. అలాగే, కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి వాహనంలో రూ. 2లక్షలు, మల్లాది రాజేందర్‌రెడ్డి వాహనంలో రూ. 1.30లక్షలు లభించగా మొత్తం రూ. 18.90 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ తిరుమల్‌ గిర్నిబావికి చేరుకుని నగదుపై ఆధారాలు చూపాలని సదరు వ్యక్తులను అడిగారు. అయితే వారు చూపిన ఆధారాలు నమ్మకంగా లేకపోవడంతో కేసు నమోదు చేయాలని సీఐ కిషన్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పూర్తి ఆధారాలు చూపితే నగదును అందజేస్తామన్నారు. ఆధారాలు లేకుండా డబ్బుతో ప్రయాణించొద్దన్నారు. కార్యక్రమంలో దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం ఎస్సైలు జక్కుల పరమేష్‌, నగేష్‌, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

అదును చూసి అపహరణ..

● తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ
● 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరణ
● ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ డేవిడ్‌రాజ్‌


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ డేవిడ్‌రాజ్‌

ఎల్కతుర్తి : ఇంటి యజమాని అనారోగ్యానికి గురయ్యారు. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేరారు. ఈ సమయంలో ఇంటి తాళం వేసి వెళ్లారు. ఇంకేముంది.. ఇదే అదునుగా భావించిన దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండిని అపహరించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంచాల వెంకటేశ్వర్లు అనారోగ్యానికి గురికాగ చికిత్స నిమిత్తం ఈనెల 12న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేరారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరించుకెళ్లారు. ఇదిలా ఉండగా చికిత్స పొందిన అనంతరం ఈ నెల 22వ తేదీన బాధితులు ఇంటివచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్‌, సీఐ ప్రవీణ్‌కుమార్‌, ఎస్సై సాయిబాబు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టాస్క్‌ఫోర్స్‌ సీఐపై వరంగల్‌ సీపీకి ఫిర్యాదు

వరంగల్‌ క్రైం: టాస్క్‌ఫోర్స్‌ సీఐ అల్లం రాంబాబుపై అడ్వకేట్‌ కిషన్‌ కుమార్‌గౌడ్‌ శనివారం సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. రిటైర్డ్‌ డీఆర్‌ పరిటాల సుబ్బారావు భూమి విషయంలో తగదా రావడంతో టాస్క్‌ఫోర్స్‌ సీఐ రాంబాబు తన కార్యాలయంలో సుబ్బారావును ఇష్టా నూసారంగా మాట్లాడారు. దీనిపై కిషన్‌కుమార్‌గౌడ్‌, సుబ్బారావు సీపీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ రంగనాథ్‌.. ఇన్‌స్పెక్టర్‌ రాంబాబుపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

మళ్లీ మొదటికి..

అభ్యర్థుల సమయం, శ్రమ బూడిదలో పోసిన పన్నీరే..

● ఇప్పటికే రెండుసార్లు రాసిన గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌
● ఇప్పుడు మళ్లీ రద్దుతో విసిగిపోతున్న నిరుద్యోగులు
● కోచింగ్‌ కోసం వేలాది రూపాయలు ఖర్చు
● నిరుద్యోగిపై అదనపు భారం పడుతుందని ఆవేదన


పరీక్ష రాస్తున్న ఉద్యోగార్థులు(ఫైల్‌)

సాక్షి, మహబూబాబాద్‌/హనుమకొండ/వరంగల్‌: సుదీర్ఘ కాలం తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీ పరీక్ష ఒక్క అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. సివిల్స్‌లో విఫలమైన వారు కొందరు.. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి మరికొందరు.. యూనివర్సిటీలు, కోచింగ్‌ సెంటర్లలో ఏళ్ల తరబడి ఉంటూ.. ఉద్యోగం కోసమే జీవితం అన్నట్లు కఠోర శ్రమ చేస్తున్న ఇంకొందరు.. ఇలా అందరూ ఇప్పటికే రెండు సార్లు పరీక్ష రాసి మెయిన్స్‌ కోసం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో 'గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్‌ రద్దు చేస్తున్నాం. మళ్లీ రాయాలని' హైకోర్టు తీర్పు ఇవ్వడంపై కన్నీరుమున్నీరవుతున్నారు. మళ్లీ పరీక్ష మొదటి నుంచి రాయాలా అని నిస్సహాయత తెలియజేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యానికి యువత బలి

సర్కారు.. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో విఫలమైంది. అసలు పరీక్ష పేర్లతో సంబంధం లేకుండా కొందరికి.. పేపర్‌ను లీక్‌ చేసి మరికొందరికి ఉద్యోగాలు ఇవ్వాలని చూసింది. అధికారుల నిర్లక్ష్యంతో పరీక్ష పేపర్లు అంగట్లో సరుకయ్యాయి. ఫలితంగా ఒకే పరీక్షను మూడు సార్లు రాయమని నిరుద్యోగులకు చెప్పి వారి సమయం, ధనం, శ్రమ వృథా చేస్తున్నారు. దీనికి ప్రభుత్వమే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని యువత డిమాండ్‌ చేస్తోంది.

జూన్‌లో జరిగిన గ్రూప్‌-1 పరీక్షకు హాజరైన అభ్యర్థులు			
జిల్లా	మొత్తం	హాజరైంది	సెంటర్లు
వరంగల్‌, హనుమకొండ	21,038	13,929	55
భూపాలపల్లి	2369	1516	09
ములుగు	1,931	1,262	07
జనగామ	2330	1079	14
మహబూబాబాద్‌	4046	2663	13

సంవత్సరాల తరబడి చదువు

గ్రూప్‌–1 ఉద్యోగం సాధించాలని యువత భారీగా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఉపాధ్యాయులు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఐసీడీఎస్‌, ఏసీటీవోలతోపాటు వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలు చేసేవారు. గ్రూప్‌–1 నోటిఫికేషన్‌ వచ్చినప్పటి నుంచి ఉద్యోగాలకు సెలవు పెట్టి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చదువుతున్నారు. అదేవిధంగా ఉద్యోగ సాధనే ధ్యేయంగా నాలుగు పదుల వయసువచ్చినా..పెండ్లి చేసుకోకుండా యూనివర్సిటీల్లో పాగావేసి గడ్డం, మీసాలు పెంచుకొని కొందరు.. నెత్తిపై ఉన్న వెంట్రుకలు రాలిపోయే అంత టెన్షన్‌తో మరికొందరు చదువుతున్నారు. ఇందుకోసం కోచింగ్‌ సెంటర్లు, మెటీరియల్స్‌ కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేసిన వారు కూడా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రిలిమ్స్‌ రద్దు అంటే అందరి జీవితాలతో ఆడుకోవడమే.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



గ్రూప్‌–1 రద్దు అత్యంత బాధాకరం. ఇప్పటికి రెండుసార్లు రాసిన. మళ్లీ రాయాల్సిన పరిస్థితి రావడం దారుణం. దీనిపై ప్రభుత్వం స్పందించి టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి. లేదా కమిషన్‌ చైర్మన్‌ తొలగించి నూతన నోటిఫికేషన్‌ జారీ చేయాలి.

– మారపాక కిశోర్‌, కురవి

ఆసక్తి సన్నగిల్లుతోంది



రెండోసారి గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ రద్దు వల్ల చదువుకోవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. ఇంత అధ్వానంగా పరీక్షలు నిర్వహించడాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఇప్పటి వరకు రూ.3 లక్షలు ఖర్చయ్యాయి. టీఎస్‌పీఎస్సీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

– తిరుపతి రెడ్డి, గణపురం, భూపాలపల్లి

ఆశ చచ్చిపోయింది



నేను ఉపాధ్యాయుడిని. కొంతకాలంగా గ్రూప్‌–1 పరీక్షలకు సిద్ధమవుతున్న. ఈ క్రమంలో మరోసారి గ్రూప్‌–1 రద్దు కావడం వల్ల ఉద్యోగం సాధించాలనే ఆశ చచ్చిపోయింది. ఉన్నత ఉద్యోగాల భర్తీలో ఇలా జరగడం ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ చిత్తశుద్ధి కనిపిస్తోంది.

– పి.చక్రపాణి, వరంగల్‌

ఒక్క పరీక్షను ఎన్నిసార్లు రాపిస్తారు



ఒక్క గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ను ఎన్నిసార్లు రాపిస్తారు.. ఇది ప్రభుత్వమేనా.. నిర్వహించేవి ఉద్యోగాల భర్తీ పరీక్షేనా.. గ్రూప్‌–1 పరీక్ష రద్దవడం అత్యంత దారుణం. వరుసగా విఫలమవుతున్న ప్రభుత్వానికి యువత బుద్ధి చెబుతారు.

– ఆవుల వేణు, మహబూబాబాద్‌

నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు



గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ ఫలితాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షను హైకోర్టు రద్దు చేసింది. ఈ పరిణామం మానసికంగా ఆందోళనకు గురి చేసింది. పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావాలంటే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాలి. కొందరు చేసిన తప్పిదాలకు లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు.

– బెల్లపురి సాయికుమార్‌, జనగామ

మళ్లీ మొదటి నుంచి చదవాలి



గ్రూప్‌–1 నోటిఫికేషన్‌ ఇచ్చి రెండేళ్లు దాటింది. నోటిఫికేషన్‌ వచ్చినప్పటి నుంచి కోచింగ్‌కు వెళ్లి పరీక్ష రాస్తున్నాం. ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. పరీక్షలు ఇప్పటికే రెండు సార్లు రద్దు అయ్యాయి. దీంతో మళ్లీ రాయాలంటే మొదటి నుంచి చదవాలి. ఉద్యోగాలు ఇవ్వొద్దని ఉద్దేశంతోనే ఇదంతా జరుగుతున్నట్లు అనిపిస్తోంది.

– కె.శ్రీజిత, విద్యార్థిని, హనుమకొండ

కూలికి వెళ్లొస్తా..జాగ్రత్త బిడ్డా..!

కూతురికి జాగ్రత్తలు చెప్పి పనికి వెళ్తూ మహిళ దుర్మరణం..

● నాయుడు పెట్రోల్‌ బంక్‌ సమీపంలో రోడ్డు ప్రమాదం.. అక్కడికక్కడే మృతి
● మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
● 108లో ఎంజీఎంకు తరలింపు


ఘటనా స్థలిలో మహిళ మృతదేహం

ఖిలా వరంగల్‌: జాగ్రత్తగా బడికి పోయిరా.. కూలికి వెళ్లొస్తా అంటూ ..బిడ్డకు జాగ్రత్తలు చెప్పి పనికి బయల్దేరిన మహిళను మృత్యువు.. ఆర్టీసీ బస్సు రూపంలో కబళించింది. ఈ ఘటన వరంగల్‌–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్‌ బంక్‌ సమీపంలో జరిగింది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో దంపతులు స్వల్పగాయాలతో బయటపడగా, ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం చెన్నారావుపేట మండలం సమీప గ్రామాలకు చెందిన బానోతు సుజాత, బాలు దంపతులు బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం హనుమకొండ వడ్డేపల్లికి చేరుకున్నారు. ఇక్కడే ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నారు. బానోత్‌ సుజాత సొంత అక్క భూక్య బుజ్జీ (35). బుజ్జీ తన భర్తకు దూరంగా ఉంటూ తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని మూడేళ్ల క్రితం వడ్డేపల్లికి చేరుకుంది. పెద్ద కూతురు భాను 7వ తరగతి చదువుతుండగా చిన్న కూతురును బంధువులకు దత్తత ఇచ్చింది. ఈ క్రమంలో సుజాత, బాలు, బుజ్జీ ముగ్గురు కలిసి ఒకే ద్విచక్రవాహనంపై భవన నిర్మాణ పనికి వెళ్తుంటారు. రోజువారీగానే శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఒకే బైక్‌పై వడ్డేపల్లి నుంచి మామునూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్‌–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్‌ బంక్‌ సమీపంలో వరంగల్‌ నుంచి తొర్రూరు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొంది. దీంతో భార్యాభర్తలు సుజాత, బాలు రోడ్డుపై పడిపోగా.. బుజ్జీ బస్సు వెనక టైర్‌ కింద పడింది. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్వల్పగాయాలతో బయటపడిన భార్యాభర్తలను స్థానికులు వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. ఈ విషయం తెలిసిన మృతురాలి కుమార్తె భాను.. తల్లి మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించింది. రోడ్డు ప్రమాద విషయం తెలియగానే మామునూరు ఎస్సైలు కృష్ణవేణి, ప్రమోద్‌కుమార్‌ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. మహిళ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అనంతరం మృతురాలి బంధువు బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు.

పెద్ద దిక్కు కోల్పోయి..

హన్మకొండ వడ్డేపల్లిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న భూక్య బుజ్జీ(35).. భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. తన కూతురును ఉన్నతంగా చూడాలకుంది. ఇంతలోనే కనిపించని లోకాలకు వెళ్లింది. బిడ్డను బడికి సాగనంపి చెల్లి, మరిదితో కలిసి బైక్‌పై బయల్దేరిన బుజ్జీ.. కొద్ది నిమిషాల్లోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో కూతురు 7 ఏళ్ల చిన్నారి భాను పెద్దదిక్కును కోల్పోయింది.

డ్రైవర్‌ను చితకబాదిన బాధితులు

అతివేగంగా.. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే రోడ్డు ప్రమాదం జరిగిందంటూ ఆగ్రహానికి లోనైన బాధితులు, స్థానికులు.. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను చితకబాదారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని బాధితులు, స్థానికులను ఘటనా స్థలి నుంచి దూరంగా పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

మహిళా కార్మికులపై వేధింపులు అరికట్టాలి


మాట్లాడుతున్న రజిత

హన్మకొండ: సంఘటిత, అసంఘటిత రంగాల్లో మహిళా కార్మికులపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని సీఐటీయూ అనుబంధ శ్రామిక మహిళా హనుమకొండ జిల్లా కన్వీనర్‌ ఎస్‌.రజిత అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో శ్రామిక మహిళా జిల్లా సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా కార్మికులపై పురుష కార్మికులు, యజమాన్యాలు ద్వంద్వర్థాల మాటలతో వేధింపులకు గురి చేస్తూ అనేక విధాలుగా హింసకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, యునైటెడ్‌ బిల్డింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షులు వెంకన్న, భూక్య సునీత పాల్గొన్నారు.

పటిష్ట జాబితాను సిద్ధం చేయండి..

వరంగల్‌ అర్బన్‌: వరంగల్‌ తూర్పు నియోజకవర్గంలో పటిష్ట ఓటరు జాబితాను రూపొందించాలని ఎలక్టోరల్‌ రోల్‌ అబ్జర్వర్‌, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్‌ సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో వరంగల్‌ తూర్పు, అసెంబ్లీ ఓటర్ల జాబితాపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్‌ బూత్‌ల వారీగా ఆయా ఓటరు నమోదు, మార్పులు చేర్పుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ రిజ్వాన్‌ బాషా, అదనపు కలెక్టర్‌ అశ్విని తానాజీ వాకడే, ట్రెయినీ కలెక్టర్‌ శ్రద్ధాశుక్ల, తహసీల్దార్లు ఇక్బాల్‌, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలి

● రిటైర్డ్‌ ఐఏఎస్‌ ఆకునూరి మురళి


మాట్లాడుతున్న ఆకునూరి మురళి

నయీంనగర్‌: పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్‌ ఐఏఎస్‌ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణలో అవినీతి, ఆర్థిక దోపిడీ రాజకీయాలను ఓడించాలని జాగో తెలంగాణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాలు, మతాల వారీగా విభజన రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని ఓడించాలన్నారు. రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి పెరిగిపోయిందని, ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తోందని, ప్రధాని మోదీ నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని రూ. 5 లక్షల కోట్ల అప్పుతో లూటీ చేశారని మండిపడ్డారు. రిటైర్డ్‌ జస్టిస్‌ చంద్రకుమార్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రజల్లో సమానత్వం లేదన్నారు. అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికి యువత మేలుకోవాలన్నారు. దేశంలో 70 శాతం ఎమ్మెల్యేలు దోచుకోవాలనే ఆలోచనతోనే ఉన్నారని, ప్రజల సంక్షేమం వారికి పట్టదన్నారు. దేశ అసలు జీడీపీ 4.8 అయితే దానిని పెంచి 7.8గా అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ప్రొఫెసర్‌ వినాయకరెడ్డి, కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ దేశం మొత్తంలో తెలంగాణ చదువులు లాస్ట్‌.. తాగడంలో ఫస్ట్‌ అన్నారు. తెలంగాణలో యువకులను తాగుడుకు బానిసలు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు యాదగిరిచార్యులు, పద్మజాషా, లక్ష్మీనారాయణ, డా.పృథ్వీరాజ్‌, సైకిబాబు, రమ, గోవర్ధన్‌ పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయ గణపతికి ఘన చరిత్ర

● ఇక్కడ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత
● 55 సంవత్సరాల నుంచి నిర్వహణ..
● నిమజ్జనోత్సవ రథానికి వేలాది భక్తుల మంగళహారతులు

హన్మకొండ కల్చరల్‌ : స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకం చేయడానికి లోక్‌మాన్య బాలగంగాధర్‌ తిలక్‌ మహారాష్ట్రలో గణేష్‌ ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలు చైతన్యం పొంది ఆంగ్లేయులపై పోరాడారు. అలాగే, ఈ ఉత్సవాలు నైజాం ప్రాంతాన్నీ ప్రభావితం చేశాయి. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరులో ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితో తెలంగాణలోని వరంగల్‌ జిల్లాలో కూడా ప్రారంభించారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో జరిగే గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. అలాగే, నిమజ్జనానికి కూడా ప్రత్యేక ఉంది. ఈ రోజున ఆలయంలో నిమజ్జనోత్సవ రథాన్ని దర్శించుకోవడానికి ప్రజలు మంగళహారతులతో ఎదురుచూస్తారు. వేలాది మంది భక్తులు వినాయకుడిని దర్శించుకుంటారు. పబ్లిక్‌గార్డెన్‌ వద్ద నిర్వహించిన గణేష్‌ ఉత్సవాలను 55 సంవత్సరాల క్రితం వేయిస్తంభాల దేవాలయానికి మార్చగా అప్పటి నుంచి గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా దాతల సహకారంతో గణపతి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ గణపతి రుద్రహోమం, వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరుగుతోంది. అలాగే, దేవాలయంలోని కాకతీయుల కాలం నాటి మూలమహాగణపతిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా రుద్రేశ్వరస్వామి వారికి అన్నపూజలు నిర్వహిస్తారు. జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థలు ఏర్పాట్లు చేస్తాయి. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

ఏటా వైభవంగా ఉత్సవాలు..



ఉత్సవాల్లో తొమ్మిది రోజులు గణపతి, రుద్ర హోమాలు, మూలమహాగణపతికి అలంకరణలు జరగడం ఇక్కడి ప్రత్యేకత. వినాయకుడి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ చుట్టూ పల్లకీసేవ నిర్వహిస్తాం. దాతల సహకారంతో ఏటా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం.

గంగు ఉపేంద్రశర్మ, ప్రధానార్చకుడు, వేయిస్తంభాల ఆలయం

దళితులను దగా చేస్తున్న సీఎం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌

నయీంనగర్‌: సీఎం కేసీఆర్‌ హామీలు నీటి మూటలేనని, 17లక్షల మంది దళితులకు దళితబంధు పథకం అమలు చేయకుండా వారిని దగా చేస్తున్నారని బీజేపీ వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ విమర్శించారు. హనుమకొండ ప్రెస్‌ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితబంధు కింద మంజూరైన యూనిట్‌ను అమ్మి ఐదుగురు పంచుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వర్ధన్నపేటలో దళిత ఎమ్మెల్యే ఉండికూడా దళితులకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిటూరి అశోక్‌ కుమార్‌, బన్న ప్రభాకర్‌, విజయ్‌ కిరణ్‌, బల్లె విక్రమ్‌ తదితరులు పాల్గొన్నారు.